క్లుప్తంగా

పత్తి విత్తనాల కొరత లేదు


స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ సందీప్

పెద్దవూర: డివిజన్ పరిధిలో పత్తి విత్తనాలకు కొరత లేదని ఇన్‌చార్జ్ ఏడీఏ సందీప్ అన్నారు. శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఏఈఓలు వానాకాలం సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలపై ఏఈఓలు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. విత్తనాల కొనుగోలు రసీదులపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్ద తూకం వేయించాలని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు


ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ, అధికారులు

దేవరకొండ : విత్తన డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ, పోలీస్‌శాఖల అధికారులు సంయుక్తంగా నాలుగు బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా డీలర్లు విత్తనాలు ఎక్కడి నుండి తెప్పించారు. వాటి ఇన్‌వాయిస్‌లు ..వాటిని ఎవరికి అమ్మారు..వంటి వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా దుకాణాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన కొంతమంది రైతులకు అధికారులు నేరుగా ఫోన్ చేసి ఏ విత్తనాలు కొనుగోలు చేశారు. ఏ ధరకు కొనుగోలు చేశారో అడిగి తెలుసుకున్నారు. పత్తి విత్తన ప్యాకెట్ ఎమ్మార్పీ ధర రూ.864 కంటే ఎక్కువ ధరకు అమ్మితే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. రైతు విక్రయ రిజిస్టర్లను నిర్వహించాలని దుకాణాదారులకు సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారులు రవికుమార్, పాండు, లక్పతి, నాగేశ్వరరావు, వెంకన్న, శ్రావణి, ఎస్‌ఐలు సైదులు, శోభన్ బాబు, వెంకటయ్య ఉన్నారు.

పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన


మల్లారెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఓ

చింతపల్లి: మండల పరిధిలోని పీకే.మల్లేపల్లి, కిష్టారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, హరిజనాపురం, సాయిరెడ్డిగూడెం గ్రామాల్లోని రైతులకు శుక్రవారం వ్యవసాయ అధికారులు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రావణకుమారి మాట్లాడుతూ.. పత్తి పంటలో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, అరుణ, మాధురి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద గత పదిహేను రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామపంచాయతీ అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న నీటి ట్యాంకులో గుర్తు తెలియని వ్యక్తులు వాటర్ బాటిళ్లను వేయడం నీటి సరఫరా నిలిచిపోయింది. ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేస్తుండడంతో శనివారం నుంచి నీటి సరఫరా కానుంది.

నీటిని మళ్లిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి: మండల కేంద్రంలోని చిన్న చెరువు నుంచి నీటిని మళ్లిస్తుండడంతో రైతులు తహసీల్దార్, ఐబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అధికారులు శుక్రవారం రైతుల సాయంతో తూమును పూడ్చారు. రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెరువులోని నీటిని తూము ద్వారా మళ్లిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ముగిసిన ఇంటింటి సర్వే

- జల సంరక్షణకు మున్సిపాలిటీలో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల వారీగా సర్వే
- ఇంకుడు గుంతలు లేని 79 మంది భవన యజమానులకు నోటీసులు
- ఇంకుడు గుంతలున్న భవనాలకు జియో ట్యాగింగ్


భవన యజమానికి నోటీసు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

దేవరకొండ : భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో ఇప్పటికే మరోమారు ఇంకుడు గుంతల నిర్మాణం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీల్లో జల సంరక్షణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటే సమస్యను అధిగమించేందుకు ఇంకుడు గుంతలు నిర్మించేలా ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో వ్యక్తిగత, కమర్షియల్, అపార్ట్‌మెంట్ల వారీగా సర్వే నిర్వహించారు. మున్సిపాలిటీలో గత నెల రోజులుగా చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసింది.

మున్సిపాలిటీలో ఇలా..

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 20వార్డులున్నాయి. వార్డుల వారిగా గతంలో నియమించిన వార్డు ఆఫీసర్లతో పాటు టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు .ఇంటింటి సర్వేలో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో 358గజాలు, ఆపై స్థలంలో నిర్మించిన ఇళ్లు, భవనాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సంబంధిత మున్సిపల్ అధికారులు భవన యజమానులకు సూచించారు. అంతేగాకుండా వారికి నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలంటూ సూచించారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 98 నిర్మాణాలు 358గజాలు దాటినవి గుర్తించగా... ఇంకుడు గుంతలు లేని కారణంగా 79 నిర్మాణాలకు సంబంధించి యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇంకుడు గుంతలు ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు,వాప్యార సంస్థలు,ఆస్పత్రులు, విద్యాసంస్థలను జియో ట్యాగింగ్ చేశారు. సర్వే సిబ్బంది జియో యాప్‌లో నమోదు చేయడం వల్ల ఇంకుడు గుంతలు ఉన్న ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉన్నాయి.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి



భూగర్భ జలాలు అడుగంటుతున్న క్రమంలో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకు గాను ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి. మున్సిపాలిటీ పరిధిలో ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే వార్డుల వారిగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంకుడు గుంతల నిర్మాణాలపై సర్వే చేపట్టాం. పలువురికి నోటీసులు సైతం జారీ చేశాం.

– ఎస్. భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ ఉత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న భాస్కర్‌రావు

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

జాతర సందర్భంగా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యనాయక్, మండల కో ఆప్షన్ సభ్యుడు బాబ్జాన్, మాజీ సర్పంచ్ కొత్త మర్రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పేర్ల లింగయ్య, మాజీ సర్పంచులు బీమానాయక్, పకిరానాయక్, కొండల్, ముత్యాలు, పెద్దంటి లింగయ్య, మహేష్ చౌదరి, సత్యం, శ్రీను తదితరులున్నారు.

ప్రయాణికులకు మజ్జిగ, పెరుగన్నం పంపిణీ

మిర్యాలగూడ టౌన్: వేసవి నేపథ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు వాసవి క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ, పులిహోర, పెరుగన్నంతో పాటు తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఐపీఎస్ మిర్యాల చక్రయ్య, ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్, వాసవి క్లబ్ గ్రేటర్ అధ్యక్షుడు రేపాల శ్రీనివాస్, కార్యదర్శి గుండా మల్లయ్య, కోశాధికారి గోనుగుంట్ల జనార్దన్, ఉపాధ్యక్షులు మంచుకొండ శ్రీనివాస్, జోనల్ చైర్మన్ లకుమారపు రమేష్, ఆర్ఎస్ నీలా ఆనంద్, రంగా శ్రీనివాస్, విద్యాసాగర్, రామలింగయ్య, పవర్, లావణ్య, వెంకటేశ్వర్లు, సరస్వతి, శ్రీనివాస్, రమేష్, వేణు, కర్నాటి శరత్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్టీసీ ఎస్ఎం భిక్షమమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు పులిహోర పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ గ్రేటర్ సభ్యులు

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

దేవరకొండ: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జూన్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 1వ తేదీన ట్యాంక్‌బండ్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ, 2న తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశం, 3న పార్టీ కార్యాలయాల్లో దశాబ్ది ముగింపు వేడుకలు ఉంటాయని చెప్పారు. ముగింపు వేడుకల్లో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాజముద్రలో మార్పులను ప్రభుత్వం మానుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గాజుల ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, వేముల రాజు, నీలా రవి, బొడ్డుపల్లి కృష్ణ తదితరులున్నారు.

విద్యుత్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన


విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట శుక్రవారం పలువురు రైతులు ఆందోళనకు దిగారు. గుర్రంపోడు మండలంలోని మొండికానిగూడెం గ్రామానికి చెందిన టేకుల శ్రీనయ్య (40) గురువారం ఉదయం కరెంట్ వైర్లు మరమ్మతులు చేసేందుకు ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ఈ సమయంలో విద్యుత్ సరఫరా చేయడంతో షార్ట్‌సర్క్యూట్‌కు గురయ్యాడు. దీంతో గుర్రంపోడు ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంజనీర్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. గాయాలపాలైన శ్రీనయ్య హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయాలి


సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

మాడుగులపల్లి: ఎన్నికల మేనిఫెస్టో హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మాడుగులపల్లి మండలంలోని ఇసుకబావిగూడెంలో శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుందా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. పేదలకు ఇళ్లు, రైతు రుణమాఫీ, వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఏమయ్యాయని ప్రశ్నించారు. హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తే ఉపేక్షించబోమని, పేదల తరఫున సీపీఎం పోరాటం ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. అనంతరం నూతన గ్రామకమిటీని ఎన్నుకుని సీపీఎం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేములపల్లి వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధన, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, యేసోబు, భిక్షం, వనమ్మ, సరిత పాల్గొన్నారు.

అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధ్యక్షురాలిగా కళ్యాణి


నియామకపత్రం అందజేస్తున్న కమిషనర్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను పూర్తి స్థాయిలో అరికట్టేందుకుగాను మిర్యాలగూడ మున్సిపాలిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధ్యక్షురాలిగా ఆర్ఓ కళ్యాణిని నియమించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ శుక్రవారం తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్షురాలిగా ఆర్ఓ కళ్యాణి, సామాజిక కార్యక్రమాల్లో అనుభవం కలిగిన ఇద్దరు వార్డు ఆఫీసర్లు వై.రాధ, పి.సరిత, మహిళల కోసం పని చేసే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు పందిర్ల పద్మావతిలను కమిటీలో నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి తదితరులున్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరళ

మిర్యాలగూడ: ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ నూకల సరళ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, విద్యా వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఏఈ ఆదినారాయణ, అమర్‌సింగ్, మౌనిక, ఉమాదేవి, విజయలక్ష్మి, ఏఓ సరిత, ఏపీఓ కళావతి, సీడీపీఓ మమత, ఎంపీటీసీలు రజిత, ఇబ్రాయిల్, ధర్మానాయక్, అరుణ, రత్నకుమారి, వెంకటరత్నం, సుజాత పాల్గొన్నారు.

ఘనంగా అనగాష్టమి వ్రతం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని రైల్వేస్టేషన్ కాలనీలో గల శ్రీసాయి దత్తాశ్రమంలో భక్తులు శుక్రవారం శ్రీఅనగాష్టమి వ్రతాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట నరేందర్, మట్టయ్య, సోమన్న, పందిరి సత్యనారాయణ, జగన్నాథరావు, జానకిరాముడు, రవికిరణ్, విక్రమ్, వెంకన్న, అంజిబాబు, అరుణ, భాగ్యలక్ష్మి, పద్మ, కళ్యాణి, భవాని, శారద తదితరులున్నారు.


అనగాష్టమి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా కోలాట పోటీలు

వేములపల్లి: మండలంలోని రావులపెంట గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మగోపయ్య స్వామివారి జాతర సందర్భంగా ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాల స్థాయి కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు జిన్న నాగిరెడ్డి, అవిరెండ్ల వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న సుప్రభాత సేవ, 6న గణపతిపూజ, గణపతిహోమం, 7న బోనాలు, స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కోలాట పోటీల్లో ఆసక్తిగల వారు రూ.500 ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.25వేలు, 2వ బహుమతి రూ.20వేలు, 3వ బహుమతి రూ.15వేలు, 4వ బహుమతి రూ.10వేలు, 5వ బహుమతి రూ.7వేలు, 6వ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 99484 23001, 99124 61744 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆయుర్వేద వైద్యపీఠంలో నిత్యాగ్ని హోత్రం ప్రారంభం

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని బోధిధర్మ ఆయుర్వేద వైద్యపీఠం కార్యాలయంలో పండిట్ శ్రీనివాస్ గురూజీ శుక్రవారం నిత్యాగ్ని హోత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చేగొండి మురళీధర్, మాధవి, శ్రీజ, రాము, లింగా, విజయ్, మనోజ్, వాణి, రవి, జయ, కోటేశ్వరి, ప్రేమలత పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు పరిశీలించారు. వారసత్వం ద్వారా వచ్చిన భూములను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుంటలుగా రిజిస్ట్రేషన్ చేయడం లేదని పలువురు సాక్షి దినపత్రిక ద్వారా ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా.. ఆర్డీఓ వచ్చిన సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేసి ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.


వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ

ఉపాధి కూలీలకు రూ.600 చెల్లించాలి


దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నారి ఐలయ్య

మిర్యాలగూడ: ఉపాధి హామీ పనుల్లో కొలతలతో సంబంధం లేకుండా ప్రతి కూలీకి రోజువారీగా రూ.600 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దామరచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వ్యవసాయంలో యంత్రాలు ప్రవేశించడంతో పనిదినాలు తగ్గిపోయాయని, తద్వారా వలసబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కూలీలకు 200 రోజుల పనిదినాలను కల్పించడంతోపాటు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇల్లుట్ల సైదులు, గుడ్డు బాల సైదులు, పెంటమల్ల సుకన్య, అందుగుల హనుమంతు, మాలోతు వినోద్‌నాయక్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

వేములపల్లి: ఉపాధి హామీ సిబ్బందిని ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. ఈమేరకు శుక్రవారం వేములపల్లి మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఇప్పటివరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఉపాధి హామీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయడంతోపాటు రాష్ట్ర బడ్జెట్‌లో 15శాతం నిధులను ఉపాధి హామీ పథకానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పిలుట్ల సైదులు, బొడ్డుమాల సైదులు, సుకన్య, మారయ్య, రెమడాల భిక్షం పాల్గొన్నారు.

మోహన్‌నాయక్ సేవలు అభినందనీయం


మోహన్‌నాయక్‌ను శాలువాతో సత్కరిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి

నాగార్జునసాగర్: అటవీ శాఖలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా జటావత్ మోహన్‌నాయక్ అందించిన సేవలు అభినందనీయమని జిల్లా అటవీశాఖ అధికారి పెట్లరాజశేఖర్ అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోహన్‌నాయక్ ఉద్యోగ విరమణ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, సాగర్ రేంజర్ రాఘవేందర్‌రావు, దేవరకొండ రేంజర్ ప్రకాశ్, కంబాలపల్లి రేంజర్ భాస్కర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న వస్కుల మట్టయ్య

మిర్యాలగూడ అర్బన్: బీసీ రిజర్వేషన్ల అమలు తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీసీ కులాలపై ప్రేమ చూపించి ఎన్నికల తరువాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు లేకపోవడంతోనే బీసీ కులాలు వెనుకబాటుకు గురయ్యాయన్నారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 11న నల్లగొండలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు కాశి, జ్యోతి, చంద్రకళ, కిరణ్, భరత్, ఆశీర్వాదం, వీరన్న తదితరులున్నారు.

నేడు హనుమాన్ జయంతి

హాలియా: పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉన్న హనుమాన్ ఆలయంలో శనివారం శ్రీహనుమాన్ జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులు అభ్రపూడి రమణశర్మ, శ్రీప్రతాపురం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో గణపతిపూజ, స్వస్తి వాచనం, కలశ ఆవాహనం, 108 కలశాలతో ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, తమలపాకుల అర్చన వంటి పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు మహాఅన్నదానం ఉంటుందని తెలిపారు.

బస్టాండ్ లేక ఇక్కట్లు

- రోడ్డు విస్తరణలో బస్‌షెల్టర్ తొలగింపు
- బస్సుల కోసం రోడ్డు పక్కనే నిల్చుంటున్న ప్రయాణికులు


రోడ్డుపైనే నిలుపుతున్న బస్సు

పెద్దవూర: మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంతో పాటు పక్క మండలాల ప్రజలు సైతం జిల్లా కేంద్రం, హైదరాబాద్, ఆంధ్ర ప్రాంతానికి వెళ్లాలన్న పెద్దవూరనే సెంటర్ పాయింట్‌గా ఉంది. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారితో పాటు జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి సైతం పెద్దవూర ప్రధాన కూడలిగా ఉంది. అనుముల మండల ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాలన్నా పెద్దవూరకు వచ్చి వెళ్తుంటారు. గత పదిహేను సంవత్సరాల క్రితం పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బస్‌షెల్టర్ ఉండేది. రోడ్డు విస్తరణలో భాగంగా దానిని తొలగించారు. బస్టాండ్ లేకపోవడంతో బస్సులు రోడ్డు పక్కనే నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

నిలువ నీడ కరువు

బస్సుల కోసం గంటల తరబడి రోడ్ల వెంట నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మండలంలోని పలు గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చిపోయే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎండలకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్ల వెంట నిరీక్షించాల్సి వస్తోంది. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండడంతో మండుతున్న ఎండలకు ప్రయాణికులు రోడ్డు వెంట నిలబడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్ల వెంట నిలబడాల్సి వస్తోంది

బస్టాండ్ లేకపోవడంతో రోడ్ల వెంటే నిలబడాల్సి వస్తోంది. దుకాణాల ఎదుట నిలబడదామన్నా వారు తిడుతున్నారు. బస్సులు కూడా రోజూ ఒకే చోట ఆపకుండా దూరంగా ఆపుతున్నారు. దీంతో బస్సు వెంట పరుగులు పెట్టాల్సి వస్తోంది.

– కోట అంజి, పెద్దవూర

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు చిన్ననాటి నుంచే కరాటే నేర్చుకోవాలని, అత్యవసర సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులను కూడా రక్షించవచ్చని షావోలిన్‌షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఫౌండర్ నాంపల్లి కనకారావు అన్నారు. నల్లగొండ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నిర్వహించిన వేసవి కరాటే శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. 37 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించి కరాటేలోని మెలకువలను నేర్పించడం జరిగిందన్నారు. తమ పిల్లలు కరాటే నేర్చుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు వివిధ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కనకారావు